క్లుప్తంగా

సీఐని కలిసిన నాయకులు



సీఐ రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

వాజేడు : వెంకటాపురం(కె) సీఐ ముత్యం రమేశ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, తల్లడి ఆదినారాయణ, కాకర్లపూడి సాయికల్యాణ్‌లు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సీఐకి శాలువా కప్పి సన్మానించి స్థానిక సమస్యలను ఆయనకు వివరించారు.

సన్మానం



మల్లికార్జునరావును సన్మానిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) : సీపీఐ జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఎన్నికై న తోట మల్లికార్జున రావును మంగళవారం వాడబలిజ సేవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా్ర దామోదర్ శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెంకటాపురం మండలం నుంచి పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ మూడు సార్లు జిల్లా కార్యదర్శిగా ఎన్నిక కావడం హర్షనీయమని అన్నారు. నాయకులు అల్లి సూరిబాబు, సునీల్, దర్ర గోపి, ప్రశాంత్ , మల్లయ్య, పానెం యశ్వంత్, నాగార్జున తదితరులు ఉన్నారు.

అవగాహన



వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పీఎస్సైలు తిరుపతి రెడ్డి, సాయికృష్ణల ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు అభయమిత్ర కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ కాంటాక్టు ద్వారా ప్రజలకు, పోలీసులకు మధ్య స్నేహభావం, మెరుగైన సంబంధాలు ఏర్పడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

మృతురాలి ఆచూకీ తెలపాలి

ములుగు రూరల్ : ములుగు ఏరియా ఆస్పత్రిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఈ నెల 6వ తేదీన ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. అయితే కొత్తపల్లిగోరి గ్రామానికి చెందిన బట్టు రాములమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినట్లు రికార్డులో నమోదైంది. కాగా చికిత్స పొందుతున్న రాములమ్మ మృతిచెందిన విషయంపై ఆరా తీయగా కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ రాకపోవడంతో మృతదేహన్ని భద్రపరిచినట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీ.. దంపతులకు గాయాలు



చికిత్స పొందుతున్న రాము

వాజేడు : మండల పరిధిలోని ప్రగళ్లపల్లి వద్ద మంగళవారం బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటాపురం(కె) మండల పరిధిలోని ఎస్సీ మర్రిగూడెం గ్రామానికి చెందిన దంపతులు రాము, తులసీకి గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా ప్రమాదానికి కారణమైన కారులోనే వారిని వెంకటాపురం(కె) ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరి కాళ్లు విరిగాయని ప్రథమ చికిత్స నిర్వహించి భద్రాచలం తరలించారు. ఏటూరునాగారంలో చదువుకుంటున్న తమ పిల్లలను కలవడానికి దంపతులిద్దరు వెళ్తున్నట్లు తెలిసింది.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ములుగు రూరల్ : మండల పరిధిలోని ఇంచర్లలో గల తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్ కేక్ కట్ చేసి, ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాజుకుమార్, బోగ గణేష్, శివ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది

- విద్యుత్ సబ్ స్టేషన్లలోని ఉద్యోగులపై పనిభారం
- అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలి: వినియోగదారులు



గోవిందరావుపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్

గోవిందరావుపేట : విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా సేవలందించేందుకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉండాలి. అయితే మండలంలో అత్యవసర సమయంలో ఆటంకం లేకుండా విద్యుత్ సేవలు అందించేందుకు ఉన్న ట్రాన్స్‌కో సిబ్బందిపై తీవ్ర పనిభారం పడుతోంది. మండలంలో మూడు సబ్‌స్టేషన్లు ఉండగా గోవిందరావుపేట, పస్రా సబ్‌స్టేషన్‌కు ఇద్దరు లైన్‌మెన్లు ఉన్నారు. కర్లపల్లి లైన్‌మెన్ పోస్టు ఖాళీగానే ఉంది.

భర్తీ కాని ఖాళీ పోస్టులు..

గోవిందరావుపేట సబ్ స్టేషన్ పరిధిలో గోవిందరావుపేట, చల్వాయి, బుస్సాపూర్, మచ్చాపూర్, సోమలగడ్డ, ఫ్రూట్‌ఫాం, లక్నవరం చెరువు, రంగాపూర్, ఎల్‌బీనగర్, రాంనగర్, మాన్య తండా, దుంపెల్లి గూడెం, పాపయ్యపల్లి, తాతయ్యపల్లి, బొల్లపల్లి గ్రామాలు ఉండగా, ఒకరే లైన్‌మెన్ ఉన్నారు. నలుగురు ఏఎల్‌ఎంలకు ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. జేఎల్‌ఎం నలుగురికి ఒక్కరే ఉండగా మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆపరేటర్లు ముగ్గురికి ఇద్దరు ఉండగా, ఒక పోస్టు ఖాళీగా ఉంది. పస్రా సబ్ స్టేషన్ పరిధిలో పస్రా, మొద్దులగూడెం, నేతాజీ నగర్, సంద్రగూడెం, గాంధీ నగర్, ప్రాజెక్ట్ నగర్, మోట్లగూడెం, ముత్తాపూర్, టపమంచ గ్రామాలు ఉండగా నలుగురు ఏఎల్‌ఎంలకు ఒక్కరు మాత్రమే ఉన్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మూడు జేఎల్‌ఎంలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కరు కూడా ఆపరేటర్ లేరు. దీంతో మూడు ఆపరేటర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కర్లపల్లి, చంద్రు తండా, బాలాజీ నగర్, అమృత తండా, పూర్య తండా, లక్ష్మీపురం, లింగాల, బందాల, కొడిశల గ్రామాలు ఉండగా ఒక్క లైన్‌మెన్ లేకపోవడం గమనార్హం. ఏఎల్‌ఎం ఇద్దరిలో ఒక్కరు ఉండగా ఒక పోస్టు ఖాళీ ఉంది. జేఎల్‌ఎం మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు ఆపరేటర్లకు ఇద్దరు మాత్రమే ఉండగా ఒక పోస్టు ఖాళీనే. మూడు సబ్ స్టేషన్ పరిధిలో ఒక్క లైన్‌మెన్ సమస్య, ఆరు ఏఎల్ఎంలు, తొమ్మిది జేఎల్‌ఎంలు, ఐదు ఆపరేటర్ల కొరత ఉంది. దీంతో వానాకాలంలో ఎక్కడ విద్యుత్ ఆటంకం కలిగినా ఉన్న సిబ్బందిపై అదనపు పని భారం పడుతుంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



మండలంలోని మూడు సబ్‌స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో ఏదైనా విద్యుత్ అసౌకర్యం కలిగినట్లయితే ఎవరికి చెప్పాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. సిబ్బందిని నియమిస్తే అందరికి అందుబాటులో ఉంటూ మరింత విద్యుత్ సేవలు అందజేస్తారు. సిబ్బంది కొరతతో విద్యుత్ సేవలకు ఆటంకం కలుగుతుంది. - సోమ మల్లారెడ్డి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సిబ్బంది కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నోటిఫికేషన్ వస్తుంది. ముఖ్యంగా మండలంలోని మూడు సబ్ స్టేషన్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సేవలందిస్తున్నాం.

- ఎం.దేవ్‌సింగ్, ఏఈ, గోవిందరావుపేట

వయోజనుల అక్షరాస్యతకు 'ఉల్లాస్'

- ఎంఈఓ, నోడల్ ఆఫీసర్ గొంది దివాకర్



మాట్లాడుతున్న ఎంఈఓ దివాకర్

గోవిందరావుపేట : వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశ పెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని మండల విద్యాధికారి, నోడల్ ఆఫీసర్ గొంది దివాకర్ సూచించారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులకు, మండల సమాఖ్య వీఓఏలకు నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో పాటు తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం ఉల్లాస్ పథకం లక్ష్యాలని పేర్కొన్నారు. 2022 సంవత్సరం నుంచి 2027 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో 15 సంవత్సరాల వయస్సు పై బడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉల్లాస్‌లో నిరక్షరాస్యులకు చదువుపై కనీస అవగాహన కల్పించడం, అంకెలు గుర్తించడం, లెక్కలు చేయడం నేర్పిస్తారని తెలిపారు. విద్యావంతులు సేవాభావంతో ముందుకు వచ్చి స్వచ్ఛంద బోధకులుగా పని చేస్తారని, ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు, వీఓఏలు ఈనెల 19వ తేదీన గ్రామ పంచాయతీల్లో వలంటీర్లకు శిక్షణ ఇస్తారని చెప్పారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సోమారెడ్డి, డి.మహేందర్, కిషోర్, ఎంఆర్సీ విష్ణు, సీఆర్పీలు చందు, భిక్షపతి, రజిత పాల్గొన్నారు.

'రైతుబీమా'కు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఓ వేణుగోపాల్

ఏటూరునాగారం / వాజేడు : గతంలో రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు నేడు(బుధవారం)వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏటూరునాగారం మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, వాజేడు వ్యవసాయాధికారి మమేష్ తెలిపారు. మంగళవారం ఆయా మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతుల నుంచి బీమా దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..18 నుంచి 59 సంవత్సరాలలోపు ఉన్న రైతులు రైతుబీమాకు అర్హులని అన్నారు. 1966, ఆగస్టు 14 నుంచి 2007,ఆగస్టు 14వ తేదీలోపు జన్మించిన రైతులు ఈ బీమాకు అర్హులుగా గుర్తించామన్నారు. గతంలో రైతు బీమా చేసుకున్న వారికి మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. నూతన రైతులు దరఖాస్తుతోపాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లను రైతువేదికలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 89777 51142 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజు, రవి పాల్గొన్నారు.

నర్సింహసాగర్‌లో టీబీ ముక్త్ భారత్



మంగపేట: వైద్యపరీక్షలు నిర్వహించి ఎక్స్‌రేకు రోగులను ఏటూరునాగారం తరలిస్తున్న సిబ్బంది



వెంకటాపురం(కె): శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

మంగపేట : మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధిలో గల నర్సింహసాగర్‌లో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో వంద రోజుల టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహసాగర్, పూరేడుపల్లి, శనిగకుంట గ్రామాల్లో దగ్గు, తెమడ, జ్వరంతో బాధపడుతూ క్షయవ్యాధి లక్షణాలు ఉన్న 34మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. వారికి ఎక్స్‌రే పరీక్షల నిర్వహణకు ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వైద్యాధికారి యమున తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం సారమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూగూరులో వైద్యశిబిరం

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని నూగూరు గ్రామంలో గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 22మందికి వైద్యపరీక్షలు నిర్వహించి తెమడ సేకరించారు. అనంతరం వారిని 102వాహనం ద్వారా ఏటూరునాగారం వైద్యశాలకు ఎక్స్‌రే నిమిత్తం తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, హెచ్‌ఈఓ కోటి రెడ్డి, సిబ్బంది యాకలక్ష్మి, వెంకటేశ్వర్లు, రవి, రాజు, ఆదిలక్ష్మి ఉన్నారు.

జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలి



ఆర్థికసాయం అందజేస్తున్న జర్నలిస్టులు

ఎస్ఎస్‌తాడ్వాయి : అనారోగ్య కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తాడ్వాయి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చల్లగొండ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం అన్నారు. మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి తుమ్మల సమ్మయ్య ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని తాడ్వాయి మండల జర్నలిస్టులు పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బండారు లక్ష్మయ్య, కోగిల సారయ్య, చింతల సంపత్, కోట రమేష్, చింతల దేవేందర్, ప్రతాప్, పుల్లూరి రాజు పాల్గొన్నారు.

'చెక్‌పోస్టు వద్ద అక్రమ వసూళ్లు'



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గోవిందరావుపేట : అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి ఆరోపించారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఫారెస్ట్ చెక్ పోస్ట్ ఎత్తివేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ వాహనదారుల నుంచి ఫారెస్ట్ అధికారులు లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని, ప్రతి రోజు వేలాది వాహనాలు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతం టూరిస్ట్ కేంద్రంగా మారిందని, పస్రా, ఏటూరునాగారం పరిసర ప్రాంతాలతో పాటు బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, మేడారం సమ్మక్క–సారక్క జాతరకు వస్తుంటారని వివరించారు. ఫారెస్ట్ అధికారులు వన్య సంరక్షణ, అటవీ సంరక్షణ బాధ్యతను విస్మరించి వసూళ్లే ధ్యేయంగా పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పస్రా, ఏటూరునాగారంలోని చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. పాదిళ్ల చిట్టిబాబు, తుమ్మల వెంకట్ రెడ్డి, ఆదిరెడ్డి, రాజేష్, సూర్యనారాయణ, ఐలయ్య, కవిత, శ్రీను, ముత్తమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మంగపేట: వృద్ధురాలిని పరీక్షిస్తున్న యమున



వాజేడు: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మంగపేట : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చుంచుపలి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున సూచించారు. మండలంలోని వాడగూడెం పంచాయతీ పరిధిలో యమున ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 22 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య జాగ్రతలు తప్పక పాటించాలని సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా చూసుకోవాలని, మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వరం వస్తే ఆస్పత్రికి రావాలి

వాజేడు : జ్వరం వస్తే తప్పనిసరిగా ఆస్పత్రికి వచ్చి వైద్యం పొందాలని వైద్యాధికారి యోషిత సూచించారు. మండల పరిధిలోని కోయవీరాపురం గ్రామంలో మంగళవారం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. వారి నుంచి రక్త నమూనాలను సేకరించి ఆర్టీటీ పరీక్షలు చేశారు. ఆ తర్వాత గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి 35 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 8మందికి జ్వరాలు ఉన్నట్లు తెలిపారు. గ్రామంలో తిరుగుతూ నిల్వఉన్న నీటిని పారబోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వస్తే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యం పొందాలని సూచించారు. కార్యక్రమంలో అనూష, చిన్న వెంకటేశ్వర్లు, నాగేంద్ర కుమారి, లలిత తదితరులు ఉన్నారు.

'ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు'



మాట్లాడుతున్న నాయకులు వెంకన్న, రఘు

ఏటూరునాగారం : ఓటు హక్కు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రైతులు, ప్రజలతో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. దేశంలో మొట్టమొదటిసారి ఓటు దొంగతనం చేసినట్లు రాహుల్ గాంధీ ఓటు చోరీ అని ప్రెస్ మీట్ పెట్టారని తెలిపారు. ఒకప్పుడు ధనికులకు మాత్రమే ఉండే ఓటు హక్కును రాజ్యాంగం ప్రతి ఒక్కరి హక్కుగా కల్పించిందన్నారు. 'ఎన్నికల్లో ఫేక్ ఓటు వచ్చిన తర్వాత మనమంతా ఓట్లు వేయడం ఎందుకని, ఎన్నికల కమిషన్ డబ్బులు ఖర్చుపెట్టి పోలింగ్ నిర్వహించడం అవసరమా అంటూ రాహుల్ గాంధీ మాట్లాడితే అగ్ర నేతను అరెస్టు చేయడం సరైంది కాదని' విమర్శించారు. కర్ణాటకలోని మహదేవపురం నియోజక వర్గంలోనే దాదాపు లక్షకు పైగా ఫేక్ ఓట్లను గుర్తించారని ఆరోపించారు. దేశంలోని ఎన్ని నియోజక వర్గాల్లో ఇంకా ఎన్ని ఫేక్ ఓట్లు ఉంటాయో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, కార్యదర్శి గుడ్ల దేవేందర్, అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, అనుబంధ సంఘాల నాయకులు, యువజన, మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

సకాలంలో ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సకాలంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకొని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి పునాది తీయించి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క కృషితో ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆకులవారి ఘణపురంలోని జక్కి పద్మలత ఇంటికి ముగ్గు పోశారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి, నాయకులు ఖలీల్, దేవేందర్, సులేమాన్, గౌస్, భరత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్తుల చేయూత



బాధితులకు నగదు అందజేస్తున్న గ్రామస్తులు

మంగపేట : మండలంలోని బుచ్చంపేట గ్రామానికి చెందిన బూర్గుల అభిషేక్ ఇటీవల ఈతకు వెళ్లి మృతిచెందాడు. కాగా మంగళవారం బాధిత కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచి రూ.48,850ల నగదు అందజేశారు. అభిషేక్ ఈనెల 3వ తేదీన స్నేహితుల దినోత్సవం సందర్భంగా మిత్రులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి గౌరారం వాగులో మునిగి మృతి చెందాడు. అభిషేక్ దశదిన కర్మ సందర్భంగా గ్రామ వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన నగదును మృతుడి తల్లిదండ్రులు బూర్గుల రమేష్, మనెమ్మకు దాతలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉగ్గుమళ్ల గణేష్, మద్దెల లక్ష్మయ్య, మండల రమేష్, పన్నాల నాగరాజు, పూజారి యాకాంతంగౌడ్, పొన్నబోయిన నాగేష్, పిట్టల సతీష్, బూర్గుల శ్రీధర్, చిట్టిమళ్ల సాయివంశీ, పల్లె విక్రమ్ తదితరులు ఉన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



ఏటూరునాగారం: మానవహారంగా ఏర్పడిన నాయకులు, విద్యార్థులు



గోవిందరావుపేట: పస్రాలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

ఏటూరునాగారం : ప్రతి ఇంటిపై త్రివర్ణ జెండా రెపరెపలాడాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో కలిసి బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీని హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించారు. అక్కడ జాతీయ జెండాలతో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచ దేశాలకు భారతదేశం దిశనిర్దేశాలు ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరు జాతీయ జెండాలను ఎగురవేసి దేశభక్తి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ దేశంలోని ప్రజల్లో దేశభక్తి, ధైర్యాన్ని నింపిందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ నాయకుడు పల్లా బుచ్చయ్య, నాయకులు సత్యం, జనార్దన్, సంతోష్ రెడ్డి, రాకేష్, ఎలేందర్ రెడ్డి, సంపత్, దుర్గారావు, నాగేశ్వర్ రావు, శ్రవణ్, వెంకన్న, ప్రవీణ్, కత్తెర శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏటూరునాగారం: జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

త్రివర్ణ పతకాలతో ర్యాలీ


గోవిందరావుపేట : మండలంలోని పస్రా గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాక ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణారావు, కార్యదర్శి కొత్త సుధాకర్ రెడ్డి, మహిళా మోర్చా నాయకులు చందా జ్యోతి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మేరుగు సత్యనారాయణ, కర్ర సాంబశివరెడ్డి, పసుల బాబు రావు, సోమి రెడ్డి, మంజ్యా నాయక్, శ్రీనివాస్, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



వాజేడు: పేరూరులో..

వాజేడు : మండల పరిధిలోని పేరూరు గ్రామంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సీఆర్పీఎఫ్ బి–39 బెటాలియన్ కమాండెంట్ చమేనారాయణ్ తుకారాం ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ జెండాలు పట్టుకుని గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి పేరూరు వీధుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలని పిలుపునిచ్చారు.ఇన్‌స్పెక్టర్ లాల్‌బాబు సింగ్ తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గుండ్లవాగు ప్రాజెక్ట్ వద్ద పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట : మండలంలోని ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ కూడా చేపల వేటకు వెళ్లొదని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ సూచించారు. మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్ట్, లక్నవరం సరస్సులను సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయని, గుండ్లవాగు ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 25 అడుగులు కాగా, పూర్తిగా నిండి మత్తడి పోస్తుందన్నారు. ప్రమాద సమయంలో వెంటనే డయల్ 100 లేదా పస్రా పోలీస్ స్టేషన్ 8712670085, 8712670086 నంబర్లలో పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944